# బికారి

శ్రీ బులుసు సుబ్రహ్మణ్యశాస్త్రి

"ఎండ తీక్షణంగావుంది. పంద్రెండు గంటల దాకా తిరిగినా పట్టెడు మెతుకులు పెట్టే దాత ఒకడైనా కనుపించలేదు —

మతి చెడిపోతూన్నది... నా కాళ్లతో నే నడుస్తున్నానా ?...? కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి—

ఇంతకీ ఖర్మం ఇలా కాలిపోతూంటే ఒకరిని అనవలసిన పనేముంది"—అంటూ పోతున్నాడొక బికారివాడు.

చల్లని పిల్లవాయువులు వీస్తున్నాయి...... ఆవులు పచ్చిక బీడుల్లో మేస్తున్నాయి—ప్రక్కనే సెలయేరు గులకరాళ్లను తోసుకుంటూ ప్రవహిస్తున్నది...సాయంసంధ్యా కిరణాలు ప్రకృతికి వింత సోయగం కల్పిస్తున్నాయి...కాని...అంతా ఆనందమయంగా వుంది...ఆ పిల్లవాయువులు ... ఆ సెలయేటి పసందు...ఆ ఆనందప్రకృతి...ఆ బీద బికారి ఆకలిచిచ్చుకు దోహదమీయలేకుండా వున్నాయి.--

అదో పాడుదేవాలయం...ఆ దేవాలయంలోకి వెళ్లడానికై ప్రక్కనున్న చెట్టునుంచి కొన్ని పూవులను కోసి...విగ్రహందగ్గరికి పోయి కూచున్నాడు..

అతనిలోని భక్తిశ్రద్ధలు పూజకు ప్రేరేపించేయి—అతడు చేస్తున్నాడు.—

కాని అతనిలోని ఆకటి ప్రేగులు ప్రళయనాదాన్ని సృష్టిస్తున్నాయి. ఆత్మ...—

తినటానికి తిండిలేదు...కట్టుకుంటకు బట్టలేదు...త్రాగడానికి నీరులేదు...కాళ్లు తేలిపోతున్నాయి—

కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి...యిదేనా భగవత్ప్రార్థనా ఫలితం? ఇదేనా సోదర మానవ రక్షణ...? ఇదేనా కర్మభూమి?...భారత సాంప్రదాయములు?...ఇదేనా జాతిమత వివక్షణ? ఇదేనా సంఘసంస్కారోద్ధారణ? ... బీదలు...ఆకటిచిచ్చుకు మలమల మాడిపోతూంటే...ధనికులు సౌధాల్లో హాయిగా సుఖభోగాలు అనుభవిస్తూ ఆనందిస్తున్నారు...

ఈ మంగళప్రద భూమిలో అన్నపూర్ణమ్మ అతిథిపూజ అంతరించి పోయిందా?...లేక...మానవ జాతిలోని విశిష్టతయే అంతరించి పోయిందా...?...లేదు...యీ పూజాపునస్కారాల్తో లాభం లేదు.—మానవజాతి పునరుద్ధారణకై జీవితమును బలిచెయ్యి.—

అంటున్నాది—..

ఆత్రుతగా లేచినించున్నాడు—కాళ్లు తనకు తెలియని మార్గాన్నే తీసుకుపోతున్నాయి—.

ఆనందమయ ప్రకృతి గోచరించింది..—

ఇవన్నీ చూచేసరికి...చంద్రుడు లేని ఆకాశం...వసంతఋతువులో కోయిల లేని వనం యెంత బలహీనంగా వుంటుందో నామనస్సుకూడ అంత హీనస్థితిలో నున్నదని అనుకొని వీధులంట బయలుదేరేను.

"అమ్మా కబళం"

అంటూ యాచించేడు...ఫలితం లేక పోయింది—

శరీరంలో సత్తువఉన్నంతవఱకూ తిరిగేడు—

నిస్సత్తువ ఆవరించిన శరీరం నేలకు ఒరిగిపోయింది—

అంతే...ఆ బికారి హృదయంలోని ఆత్మ అనంత వాయువులో కలసిపోయింది—

సంఘం కాని ... సమాజవ్యక్తులు కాని... అతని భౌతిక శరీరాన్ని దహనపరచడానికి గంధపు చెక్కలు గాదు...కొసకు చీపురుపుల్లలైనా తేలేదు...సరికదా ఆవైపేనా చూడలేదు—..

కాని...తాటిచెట్టుమీద నున్న రాబందు...మాత్రం అతనిమీద వ్రాలి మాంసం లేకపోవుట చేత కాబోలు మళ్లీ స్వస్థానానికి వెళ్లిపోయింది.

అంతే...